# 8

# విశ్వాసము యొక్క స్వభావము

## (11వ అధ్యాయం)

హెబ్రీ పత్రికెవరినుద్దేశించి వ్రాయబడిందో వారు తమ ఆత్మీయ జీవితమును బట్టి మరణకర సవాలును ఎదుర్కొంటున్నారు - వారు దేవుని నుండి తప్పిపోయే పెను ప్రమాదంలో ఉన్నారు. పదవ అధ్యాయం చివరి భాగంలో, ఈ సవాలును గురించి గ్రంథకర్త వారిని హెచ్చరిస్తున్నాడు. వారు తప్పిపోతే వారికి ఏం సంభవిస్తుందో దానిని గురించి హెచ్చరిస్తున్నాడు (10:26-31). అలాగే వారు విశ్వాసంలో ఎదుగవలనని వారిని ప్రోత్సహిస్తున్నాడు. తరువాత ఈ మాటలతో తన హెచ్చరికను ముగిస్తున్నాడు - "అయితే మనము నశించుటకు వెనుకతీయువారముకాము గాని ఆత్మను రక్షించుకొనుటకు విశ్వాసము కలిగినవారమై యున్నాము" (10:39).

తాము పడిపోకుండా నుండుటకు, నిత్యముగా రక్షింపబడుటకు ఈ క్రైస్తవులకు అవసరమైనది ఏమిటి? విశ్వాసం! మనము విశ్వాస భ్రష్టులు కాకుండా ఉండడానికి మనకు కూడ విశ్వాసమును కాపాడకొనుట ఎంతో అవసరం.

క్రైస్తవుని అంతిమ రక్షణకు మూలము రక్షణ అని గ్రంథకర్త వివరించిన తరువాత "విశ్వాసం" అంటే ఏమిటో దానిని వివరిస్తున్నాము. విశ్వాసం యొక్క స్వభావమును గురించి అతడు ఒక ప్రసంగమును చేస్తున్నాడు. ఆ ప్రసంగాన్ని చదివి దాని ద్వారా విశ్వాసపు స్వభావం గురించి పరిశుద్ధాత్ముడు మనకు ఏం చెప్తున్నాడో చూద్దాము!

### భౌతికంగా స్పర్శించలేని దానిని విశ్వాసం అంగీకరిస్తుంది

విశ్వాసపు స్వభావాన్ని గురించి మనం నేర్చుకుంటున్న మొదటి సత్యం ఏమిట ంటే, భౌతికంగా గుర్తించలేని దానిని విశ్వాసం ఒక సత్యముగా అంగీకరిస్తుంది. 11వ అధ్యాయం యొక్క సిద్ధాంతమును హెబ్రీయులకు 11:1, 2 వచనాలు తెలియజేస్తున్నాయి. "విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజస్వరూపమును అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది. దానిని బట్టియే పెద్దలు సాక్ష్యముపొందిరి."

మనం ఒక్కోసారి హెబ్రీయులకు 11:1ను "విశ్వాసం" యొక్క నిర్వచనంగా చెపుతాము. సాంకేతికంగా ఇది అసలైన నిర్వచనం కాదు. ఎందుకంటే, నిర్వచనం, అది నిర్వచిస్తున్న పద హద్దులను నియమిస్తుంది. అయితే "విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజవునైయున్నది" అని ఒకరు చెప్తున్నప్పుడు, అతడు "విశ్వాసం" యొక్క పూర్తి అర్థమును ఇయ్యడం లేదు. కాబట్టి ఈ వచనం "విశ్వాసం" యొక్క పూర్తి నిర్వచనం కాదు. ఎలాగంటే, "దేవుడు ప్రేమామయుడు" అన్న మాట "దేవుడు" అన్న పదము యొక్క నిర్వచనం ఎలా కాదో ఇదీ కూడ అంతే! దేవుడు ప్రేమామయుడే గాని ప్రేమ అనేది ఆయన స్వభావములో ఒక లక్షణం మాత్రమే! అలాగే అదృశ్యమైన వాటిని అంగీకరించడం అన్నది విశ్వాసంలో ఒక క్రియ అంతేగాని అదే

విశ్వాసం కాదు.

అయితే, హెబ్రీయులకు 11:1లోని ఈ భావము ఈ అధ్యాయమునకు సరియైనది. విశ్వాసం అంటే, ఆత్మీయ సంగతులను ఒక వ్యక్తి తన శారీరక ధర్మముల అనుసారం వివేచింపకపోయినా, అవి నిజమని వాటిని బట్టి అనుసరించి నడుచుకోవడం అన్న అర్థమును ఇక్కడ చూస్తున్నాము.

నిజ జీవితంలో దాని ఉద్దేశం ఏమిటి? నేను మీకు చూపిస్తాను. "విశ్వాసమును బట్టి దేవుని చేత సాక్ష్యము నొందిన 'పెద్దల' జీవితమును చూపించి దాని ద్వారా విశ్వాసము యొక్క స్వభావమును వివరిస్తాను" అని గ్రంథకర్త చెప్తున్నాడు. తరువాత అతడు తన పరిశుద్ధ గ్రంథంలోని (పాత నిబంధన) వ్యక్తులను ఒకరి తరువాత ఒకరిని మన దృష్టికి తీసుకువస్తున్నాడు.

విశ్వాస స్వభావాన్ని గురించిన మొదటి ఉదాహరణ 3వ వచనంలో కనబడుతుంది: "ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మాణమైనవనియు అందునుబట్టి దృశ్యమైనవి కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసముచేత గ్రహించుకొనుచున్నాము." ప్రపంచం ఎలా ఆవిర్భమైంది? మనం అప్పుడు లేము, దాని నిర్మాణమును మనం చూడలేదు. కానీ దేవుడు దానిని నిర్మించాడన్న విశ్వాసం మనకు ఉంది. భౌతిక సాధనముల ద్వారా మనం ఎరిగియుండలేదు కాబట్టి "విశ్వాసమును బట్టి" దేవుడే నిర్మించాడని నమ్ముతున్నాము. తరువాతదిగా, విశ్వాస స్వభావమునకు సాక్షిగా వాక్యం నుండి కొంతమందిని ఉదాహరణలుగా చూస్తున్నాము.

## దేవుని సంతోషపర్చే వారముగా విశ్వాసం మనలను చేస్తుంది

విశ్వాసపు స్వభావాన్ని గురించి మనం నేర్చుకుంటున్న రెండవ సత్యం. అది మనలను దేవుని సంతోషపర్చేవారముగా చేస్తుంది. (చదవండి హెబ్రీయులకు 11:4-7.) వాక్యమును కొనసాగిస్తూ, గ్రంథకర్త ఆదికాండము 4 నుండి హేబెలును గురించి చెప్తున్నాడు. తరువాత హనోకు గురించి (ఆదికాండము 5) మరియు నోవహు గురించి (ఆదికాండము 6) చెప్తున్నాడు. వీరందరూ దేవున్ని సంతోషపెట్టినవారు అలాగే వారి గురించి పరిశుద్ధాత్ముని ముగింపు ఏమంటే, వారు విశ్వాసం కలిగియున్నవారు. "విశ్వాసములేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము. దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా!" (11:6). ఈ వచనం మనకు ఎంతో ప్రాముఖ్యమైనది. దేవుడు ఉన్నాడని నమ్మడం మరియు ఆయన మనకు ఫలము దయచేస్తాడని నమ్మడం అన్న ఈ రెండు విశ్వాసపు అంశాలు లేకుండా మనం దేవున్ని సంతోషపెట్టలేము. క్రైస్తవుడగుటకు విశ్వాసం ఎంతో అవసరం. క్రైస్తవునిగా జీవించుటకు విశ్వాసం ఎంతో అవసరం.

## విశ్వాసం విధేయతను చూపిస్తుంది

విశ్వాసపు స్వభావం గురించి మనం నేర్చుకుంటున్న మూడవ అంశం ఏమిటంటే, విశ్వాసం విధేయతను చూపిస్తుంది. (చదవండి హెబ్రీయులకు 11:8-12.) "విశ్వాసులకు తండ్రి" అని అబ్రాహాము ఎందుకు పిలువబడ్డాడు? ఎందుకంటే అతడు విధేయత చూపించాడు

(11:8)! అబ్రాహాము యొక్క విధేయతకు సంబంధించి గొప్ప ఉదాహరణ 11:17-19లో చెప్పబడింది. దేవుడు తన కుమారుడైన ఇస్సాకును బలిగా అర్పించమన్నప్పుడు అబ్రాహాము అందుకు సిద్ధపడడము మనకు కనబడుతుంది. ఎంత గొప్ప విశ్వాసం! మన విశ్వాసాన్ని దేనితో పోల్చవచ్చు? ఈ అధ్యాయంలో వివరించబడిన విశ్వాసం క్రియలు లేనిది కాదు. ఇది క్రియాత్మకమైనది. ఇది లోబడేది! విశ్వాసం ఏం చేసిందో చూడండి:

విశ్వాసమును బట్టి హేబెలు బలి అర్పించాడు ... (4 వ.).
విశ్వాసమును బట్టి నోవహు ఓడను నిర్మించాడు ... (7 వ.).
విశ్వాసమును బట్టి అబ్రాహాము విధేయుడయ్యాడు ... (8 వ.).
విశ్వాసమును బట్టి అబ్రాహాము అర్పించెను ... (17 వ.).
విశ్వాసమును బట్టి ఇస్సాకును అశీర్వదించాడు ... (20 వ.).
విశ్వాసమును బట్టి యాకోబును ఆశీర్వదించాడు ... (21 వ.).
విశ్వాసమును బట్టి మోషే తల్లిదండ్రులు అతన్ని దాచిపెట్టారు ... (23 వ.).
విశ్వాసమును బట్టి మోషే తిరస్కరించాడు ... (24 వ.).
విశ్వాసమును బట్టి మోషే పస్కాను ఆచరించాడు ... (28 వ.).
విశ్వాసమును బట్టి ఇశ్రాయేలీయులు ఎఱ్ఱసముద్రమును దాటారు ... (29 వ.).
విశ్వాసమును బట్టి యెరికో గోడలు కూలిపోయాయి ... (30 వ.).
విశ్వాసమును బట్టి రాహాబు వేగులను చేర్చుకున్నది ... (31 వ.).

మీకు విశ్వాసం ఉందా? మీరు ఎలా ఆలోచిస్తున్నారు, మీ నడవడిక, మీ భావములవంటి వాటిపై మీ సమాధానం ఆధారపడియుండదు. మీరు ఏం చేస్తున్నారు అన్న దానిపై ఆధారపడి యుంటుంది! మీరు దేవునికి విధేయులైతే, మీరు దేవున్ని నమ్ముతుంటే, మీకు విశ్వాసం ఉంది. లేకుంటే మీకు విశ్వాసం లేనట్లే.

### అంతిమ బహుమానము వైపు విశ్వాసం చూస్తుంది

ప్రస్తుతపు శ్రమలకు అతీతంగా అత్యున్నత, అంతిమ బహుమానం వైపు చూస్తున్నది విశ్వాసం అన్న విషయం విశ్వాసపు స్వభావమును గురించి మనం నేర్చుకుంటున్న నాల్గవ సత్యం! విశ్వాస వీరులు తాము కోరుకున్న విషయపు నెరవేర్పును ఈ లోకంలో చూడలేదన్న విషయాన్ని 11:13-22 వాక్య భాగం చెప్తుంది. అబ్రాహామునకు ఒక ప్రదేశం వాగ్దానం చేయబడింది కానీ అతడు బ్రదికియుండగా దానిని చూడలేదు. యాకోబు ఏశావులను ఇస్సాకు దీవించాడు కానీ ఆ ఆశీర్వాదాలు వారి జీవితంలో నెరవేరడం చూడలేకపోయాడు. యాకోబు తన కుమారులను దీవించాడు. ఆ దీవెనలు ఫలభరితం కావాలనుకున్నాడు కానీ, వాటి నెరవేర్పును తన జీవితంలో చూడలేకపోయాడు. యోసేపు నిజానికి తన పార్థీవ (మట్టి) దేహం సరిగా పూడ్చిపెట్టబడాలని, ఒక రోజున ఇశ్రాయేలీయులు ఐగుప్తులోనుండి బయటికి పడతారని అనుకున్నాడు. కానీ, వాటిని చూడక ముందే అతడు మరణించాడు.

మరయితే “విశ్వాసం” అంటే ఏమిటి? వర్తమానంనకు అతీతంగా చూడడం మరియు ఆ నిరీక్షణ నెరవేర్పును భవిష్యత్తులో చూడడం. మనం మన పితరులవలె ఉంటే (13-16 వచనాలు), వారిని ఆశీర్వదించినట్లు మనలను కూడ దేవుడు ఆశీర్వదిస్తాడు (“వారు వాగ్దానములు పొందుకున్నారు”; 17 వ.; చూడు 33 వ.).

## జ్ఞానయుక్తమైన నిర్ణయాలు తీసుకోవడానికి విశ్వాసం మనకు సహాయపడుతుంది

విశ్వాసం గురించి మనం నేర్చుకుంటున్న ఐదవ సత్యం ఏమంటే, మనం ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో నిర్ణయించుకోవడం కష్టమైనప్పుడు మనం సరైన వాటిని నిర్ణయించుకునేలా విశ్వాసం మనకు సహాయపడుతుంది (చదవండి హెబ్రీయులకు 11:23-28). తమ బిడ్డను చంపివేయాలా లేక దాచిపెట్టాలా అన్న నిర్ణయాన్ని మోషే తల్లిదండ్రులు తీసుకోవాల్సి వచ్చింది. మోషే కూడ తాను ఫరో ఇంటిలో ఉండాలా లేక తన బానిస ప్రజలతో పాటు ఉండాలా అన్న నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. దేవుడు పదవ తెగులును పంపించినప్పుడు తమ తలుపుల మీద రక్తమును ప్రోక్షించి దేవునికి లోబడియుండాలా లేదా అన్న నిర్ణయాన్ని ఇశ్రాయేలీయులు తీసుకోవాల్సి వచ్చింది. అలాగే దేవుని ఆజ్ఞలను అనుసరించి తాము ఎఱ్ఱసముద్రమును దాటాలా వద్దా అన్న నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఇవన్నీ కష్టతర నిర్ణయాలే! అయితే వీరందరూ మంచి నిర్ణయాలే తీసుకున్నారు. అలాంటి నిర్ణయాలు తీసుకోవడానికి వారికి ఏది సహాయపడింది? అది విశ్వాసం. బహుమానం యందలి విశ్వాసం. ఉదాహరణకు మోషే, బహుమానమందు దృష్టియుంచి "అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలు" అని ఎంచుకున్నాడు (11:25, 26).

ఈ రోజున మనకూ ఇటువంటి విశ్వాసం కావాలి. కష్టతర నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఈ విశ్వాసం కలిగియుండాలి. "నేను మెషినరీగా పనిచేయగలనా?"; "నేను పరిశుద్ధునిగా ఉండి అనైతికతను దూరం చేయగలనా?"; "ధనమును, సుఖభోగములను ప్రేమించుట అనే లౌకిక శోధనను తిరస్కరించగలనా?" సరైన నిర్ణయములను తీసుకొనుటకు బహుమానం మీద దృష్టియుంచే విశ్వాసం మనకు కావాలి.

## మనకు విజయం కలిగేలా విశ్వాసం చేస్తుంది

విశ్వాసపు స్వభావం గురించి మనం నేర్చుకుంటున్న ఆరవ సత్యం ఏమిటంటే, మనం దేవుని మీద ఆధారపడినప్పుడు, ప్రతి అడ్డంకిని మనం అధికమిస్తాము. 11:29-31లో ఇయ్యబడిన మొదటి మూడు ఉదాహరణలు గుర్తించదగ్గవి. అందరి అంచనాలను తలక్రిందులు చేస్తూ ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి తప్పించుకున్నారు. యెరికో గోడలు ఇశ్రాయేలుకు పడవలసినది కాదుగాని (మానవ ఆలోచన ప్రకారం), యెరికో గోడలు వారి ముందు కూలిపోయాయి. ఒక స్త్రీ, రాహాబు, దేవుని సహాయంతో ఇశ్రాయేలు యెరికో ప్రజల మీద గెలుస్తుందనే నమ్మి తన కుటుంబాన్ని రక్షించుకుంది. ఎంత గట్టి అవరోధాలు వచ్చినా, విశ్వాసం ద్వారా విజయం వస్తుంది.

అయితే విజయం మన స్వంత బలంతో రాదు. ఇది దేవుని బలంతో వస్తుంది. మనకు విశ్వాసం మీద విశ్వాసం అవసరం లేదు గాని దేవుని మీద విశ్వాసం కావాలి. ఇశ్రాయేలీయులు గెల్చిన యుద్ధములు దేవుని ప్రజల బలముచేత కాదు గాని దేవుని బలము చేతనే అని పాత నిబంధన స్పష్టం చేస్తుంది.

విజయం అనేది విశ్వాసం ద్వారానే వస్తుంది అనే విషయాన్ని తరువాత కొన్ని వచనాలు తెలియజేస్తున్నాయి (చదవండి హెబ్రీయులకు 11:32-35ఎ). ఇశ్రాయేలు చరిత్రలోనికి వైభవకర సంఘటనలన్నీ వారు తమ రక్షణ నిమిత్తం దేవుని మీద ఆధారపడినప్పటి

ఫలితమే!

తరువాత దృక్పథం మారిపోయింది. 11:35బి-38లో మనకు లోకపర విజయాలు కనబడవు. మరి వీరు ఎలా విజయవంతులు కాగలరు? వారు విజయులు కారు. ఈ లోకంలో వారు విజయవంతులు కాలేదు. కానీ వారు రాబోవు జీవితంలో విజయులయ్యారు. దీనిని చదవండి,

> వీరందరు తమ విశ్వాసముద్వారా సాక్ష్యము పొందినవారైనను, మనము లేకుండ సంపూర్ణులు కాకుండు నిమిత్తము, దేవుడు మనకొరకు మరి శ్రేష్ఠమైనదానిని ముందుగా సిద్ధపరచెను గనుక వీరు వాగ్దానఫలము అనుభవింపలేదు (11:39, 40).

దేవుని శక్తి ద్వారా విశ్వాసంవలన కలిగే విజయం ఈ జీవితంలో అనేకసార్లు విజయం కాదు అని మనం నేర్చుకుంటున్నాము. కానీ ఇది విజయమే! మన అంతిమ విజయం పరలోకంలోనే ఉంటుంది.

## ముగింపు

మన తరము యొక్క ప్రాముఖ్యతను 11:39, 40 తెలియజేస్తుంది. ధర్మశాస్త్రం మరియు క్రీస్తుని రాక నెరవేర్పు గాకుండా ఈ విశ్వాస వీరులు సంపూర్ణులు గాలేరు. దేవుని గొప్ప వీరుల జాబితాలో మనకూ చోటు ఉందని ఈ వాక్య భాగం చెప్తుంది.

తన నిర్ణయములను బట్టి మోషే అక్కడ ఉంటాడు. అలాగే మీరు కూడ మీ నిర్ణయములను బట్టి అక్కడ ఉండగలరు. తన విధేయతను బట్టి అబ్రాహాము అక్కడ ఉన్నాడు. అలాగే మీరు కూడ మీ విధేయతను బట్టి అక్కడ ఉండగలరు. ఏమున్నదో ఎరుగకుండనే దేవుని మాట చొప్పున బయలువెళ్ళిన మన పితరులు అక్కడ ఉన్నారు. అదే కారణమును బట్టి అనేక మంది మిషనరీలు అక్కడ ఉన్నారని నేను నమ్ముతున్నాను. దేవుడు చెప్పిన సంగతులు తనముందు అదృశ్యముగా ఉనున్నాగాని, దేవుడు చెప్పిన ప్రకారం చేసినందుకు నోవహు అక్కడనున్నాడు. మీరు కూడ అదే కారణమునుబట్టి అక్కడ ఉండగలరు.

అయితే, పశ్చాత్తాపంతో దేవుని వైపు తిరిగి, బాప్తిస్మం పొంది, రక్షించబడకపోతే, అట్టి విశ్వాసమును మీరు పొందలేరు, ఆ గొప్ప విశ్వాస వీరులతో ఉండలేరు. మీరు ఇంకను విధేయులైయుండక పోతే ఆయనకు ఇప్పుడే విధేయులుకండి!